ఘాటెక్కిన పచ్చిమిర్చి ధర

ప్రజాశక్తి - పాలకొల్లు

పక్షం రోజులుగా ఎండలతోపాటు పచ్చిమిర్చి ధర ఘాటు పెరిగింది. ఎండలకు ముందు కిలో రూ.40 ఉన్న పచ్చిమిర్చి ధర ప్రస్తుతం కిలో రూ.వంద నుంచి రూ.120 వరకూ పలుకుతోంది. సాధారణంగా వేసవిలో పచ్చిమిర్చి ఘాటు ఎక్కువగా ఉంటుంది. ఎండలు పెరిగితే పచ్చిమిర్చి ధర ఘాటు కూడా పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో గృహిణులతోపాటు పచ్చిమిర్చి ఎక్కువగా వాడే హోటల్, కర్రీ పాయింట్ యజమానులు గగ్గోలు పెడుతున్నారు.

చినుకు రాలదు.. విత్తు పడదు..!

జూన్ మూడో వారం ముగుస్తున్నా జాడలేని వాన

నైరుతి రుతుపవనాల మందగమనంతో వడగాల్పుల జోరు

నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రాలేని పరిస్థితి

ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి

కౌలురైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు వెనుకంజ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చినుకు జాడ కోసం అన్నదాత కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే తప్ప ఖరీఫ్ సాగు ముందుకు సాగే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో చినుకు పడేదెప్పుడు.. విత్తు నాటేదెప్పుడు అంటూ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జూన్ మూడోవారం ముగుస్తున్నా ఇప్పటికీ వర్షం జాడ లేకుండాపోయింది. నైరుతి రుతుపవనాలు మందకొడిగా కదులుతున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. రోజురోజుకీ వడగాల్పులు పెరిగిపోతుండటంతో నారుమడులు వేయాలంటేనే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు ఖరీఫ్‌సాగుకు సన్నద్ధమయ్యారు. విత్తనాలు సిద్ధం చేసుకుని ఖరీఫ్ సాగుకు నారుమడులు వేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసినా ఇప్పటి వరకూ రైతులు నారుమడులు వేయలేని పరిస్థితి నెలకొంది. అందుకు ప్రధాన కారణం వానలు కురవకపోవడమే. పంట కాలువలకు సాగునీరు విడుదల చేసినా వానలు లేకపోవడంతో వడగాల్పుల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. రోజురోజుకీ వడగాల్పులు పెరుగుతున్నాయే తప్ప తగ్గుముఖం పట్టడం లేదు. వాన కురిస్తే తప్ప భూమి చల్లబడే పరిస్థితి లేకుండాపోయింది. ఈ తరుణంలో నారుమడులు వేసినా వడగాల్పులకు మొలకలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అదే జరిగితే రెండోసారి నారుమడులు వేయాల్సిన దుస్థితి ఏర్పడనుంది. రైతు నెత్తిపై అదనపు పెట్టుబడి భారం పడనుంది. దీంతో రైతులు నారుమడులు వేసేందుకు ముందుకు రావడం లేదు. నారుమడులు సకాలంలో వేసే అవకాశం లేకపోవడంతో ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తే జూన్ నెలాఖరుకుగాని నారుమడులు పడే పరిస్థితి కన్పించడం లేదు. అదే జరిగితే జులై 25వ తేదీ తర్వాతగాని ఖరీఫ్ నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉండదు. దీంతో ఖరీఫ్ మాసూళ్లు ఆలస్యంగా వచ్చే పరిస్థితి ఉంది. ఈ పరిణామాలతో రబీ సాగు సైతం మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఈ ఏడాది సాగుపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది.

కౌలురైతులకు రుణాలిచ్చేందుకు ముందుకురాని బ్యాంకులు

జిల్లాలో 70 శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలురైతులే చేస్తున్నారు. ఖరీఫ్‌సాగు ప్రారంభించేందుకు రైతులు సన్నద్ధంగా ఉన్నప్పటికీ కౌలురైతులకు రుణార్హత కార్డులుగాని, పంటరుణాలుగాని అందని దుస్థితి నెలకొంది. ఈ నెల 16వ తేదీన జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గతేడాది కౌలురైతులకు 50 వేల వరకూ రుణార్హత కార్డులు ఇచ్చామని, రైతులందరికీ పంటరుణాలు పొందే అర్హత ఉన్నప్పటికీ బ్యాంకులు కేవలం 20 శాతానికి మించి కౌలురైతులకు పంటరుణాలు అందించలేదని అన్నారు. దీన్ని బట్టి కౌలురైతు పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని స్పష్టమవుతోంది. ప్రస్తుత ఖరీఫ్‌లోనూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ సైతం తూతూమంత్రంగా సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా కౌలు రైతులందరికీ రుణార్హత కార్డులు, రుణాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

సంఘీభావ సభలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరావు

దళితులపై జగన్ సర్కార్ యుద్ధం అమానుషం

విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు

చించినాడ పేదల దీక్షకు సంఘీభావం

ప్రజాశక్తి - యలమంచిలి

మట్టి అక్రమ తవ్వకాల ముసుగులో చించినాడలో దళితులపై జగన్ సర్కార్ యుద్ధం చేస్తుందని, లంక భూములకు డి.పట్టాలు అని ప్రభుత్వం ఒకవైపు ప్రకటిస్తూ.. మరోవైపు లంకల్లో దళితులను లాఠీలతో మోది బయటకు ఈడ్చేయడం దుర్మార్గమని విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు అన్నారు. తక్షణం పెరుగులంక భూములకు డి.ఫారం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. చించినాడలో దళితుల దీక్షా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విదసం ఐక్యవేదిక తరపున రాష్ట్రం నలుమూలల నుడి వచ్చిన ప్రతినిధులు పేదలనుద్దేశించి మాట్లాడారు. పోరాట కమిటీ నాయకులు కె.బాలరాజు, ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సహజ న్యాయ సూత్రాలను సైతం ఉల్లంఘించి లంక భూముల్లో అనుభవదారుల ఆమోదం లేకుండా వారి భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. మట్టిని అక్రమంగా తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, బాధిత దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎపి మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర నాయకురాలు బూసి పరమేశ్వరి మాట్లాడుతూ కోర్టు ఆదేశాలకు తప్పుడు భాష్యం చెప్పి దశాబ్దాలుగా దళితుల సాగులో ఉన్న భూముల్లోకి అర్ధరాత్రి యంత్రాలు దింపి లంకను మళ్లీ గోదారిలా మార్చడంలో అధికార పార్టీ కుట్ర దాగి ఉందన్నారు. ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఐక్యవేదిక సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత మాట్లాడుతూ నదికి 200 మీటర్లలోపు తవ్వకాలు జరపకూడదని, సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి అధికారులే తవ్వకాలు జరిపిస్తున్నారంటే చట్టానికి దిక్కేదని ప్రశ్నించారు. చించినాడ ఘటనపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోల హరిబాబుతోపాటు వివిధ జిల్లాల నాయకులు గుబ్బల శ్రీనివాస్, నేలపూడి మోహన్‌రావు, కస్తూరి వెంకటరావు, విజయ్‌కుమార్, బల్లకుమార్, ఎస్.నూకరాజు, గంగరాజు, ముత్యాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా మొగల్తూరు సెంటర్

సన్‘డే’

ప్రజాశక్తి - మొగల్తూరు

భానుడి భగభగలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మొగల్తూరులోని గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతం ఆదివారం అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో జన సంచారం లేక వెలవెలబోయింది. గత వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజలు బయటికి రావడానికి భయపడుతున్నారు. దీంతో పలువురు దుకాణదారులు తమ దుకాణాలను మూసివేస్తున్నారు.

ఆచంట: ఎండలు మండుతున్నాయి. జనజీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. మండలంలో రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నిప్పుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. దీంతో జనం ఇంట్లో నుంచి బయటకు రావడానికి హడలెత్తిపోతున్నారు. మృగశిర కార్తెలోనూ ప్రచండ భానుడి భగభగలకు ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతకు భూమిలో నుంచి సెగలు రావడంతో వడగాల్పులు వీస్తున్నాయి. రాత్రి సమయంలో కూడా వేడి గాలులతో ఉక్కబోతను తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత కూడా వడగాల్పులు వీస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు, ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ మూడో వారం ప్రవేశించినప్పటికీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 11 గంటల సమయానికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. దీనికితోడు అప్రకటిత విద్యుత్ కోతలతో చిన్నారులు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. లోఓల్టేజీ సమస్యతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకొల్లులో కురుస్తున్న వర్షం

ఉదయం వర్షం.. మధ్యాహ్నం ఎండ

పాలకొల్లు: పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. అయితే మధ్యాహ్నం నుంచి తిరిగి ఎండ తీవ్రత పెరిగి జనం ఉక్కబోతతో విలవిల్లాడారు. మరోపక్క తరచూ విద్యుత్ కోతలతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దారుణంగా విద్యుత్ కోతలు ఉంటున్నాయని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

ఆయన వేదిక ఎక్కి నటిస్తే నవరసాలు నర్తిస్తాయి...

కళారంగ ముద్దుబిడ్డ గరగ సూర్యనారాయణ కన్నుమూత

అలనాటి అగ్ర కథానాయకులతో నటించిన సూర్యనారాయణ

300కు పైగా చలనచిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టు, కమెడియన్‌గా నటన

వందల సంఖ్యలో డ్రామాల నిర్వహణతో మంచి గుర్తింపు

ప్రజాశక్తి - భీమవరం

ఆయన వేదిక ఎక్కి నటిస్తే నవరసాలు నర్తిస్తాయి... సన్నివేశానికి తగ్గట్టుగా నటించి ప్రేక్షకులను ముగ్ధులను చేయడంలో ఆయనకు ఆయనే సాటి. అలనాటి అగ్ర కథానాయకులతో నటించి సినీరంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఆయన మరెవరో కాదు భీమవరానికి చెందిన సినీ, నాటక రంగ కళాకారుడు, అభ్యుదయవాది గరగ సూర్యనారాయణ. సూర్యనారాయణ శనివారం సాయంత్రం కన్నుమూయడంతో కళామతల్లి చిన్నబోయింది.

భీమవరంలో సూర్యనారాయణ అందరికీ అత్యంత ఆప్తులు. మంచితనానికి మారుపేరుగా ప్రతిఒక్కరితో స్నేహస్వభావం కలిగి ఉండటంలో ఆయనకు ఆయనే సాటి. సినీనాటక రంగంలో ఆయన కృషి ఎనలేనిది. అభ్యుదయ భావాలతో ముందుకు సాగిన సూర్యనారాయణ (80) శనివారం సాయంత్రం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో భీమవరం పట్టణంతోపాటు సినీ, కళా రంగాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గరగ వెంకటనారాయణ, నాగమణి దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో మొదటి కుమారుడు గరగ సూర్యనారాయణ. అయితే వీరిది వ్యవసాయ కుటుంబం. సూర్యనారాయణ ప్రాథమిక విద్య భీమవరంలో అభ్యసించి ఉన్నత విద్యను ఆంధ్ర యూనివర్సిటీలో అభ్యసించారు. అయితే సూర్యనారాయణ చిన్ననాటి నుంచి కలలపై ఎంతో మక్కువ చూపేవారు. ఒకపక్క విద్యాభ్యాసం సాగిస్తూ అనేక డ్రామాల్లో నటించారు. సూర్యనారాయణ లక్ష్మి కమలను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు వెంకట్ ఫణి, ద్వారకానాథ్. ప్రస్తుతం వీరు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు.

కళలపై మక్కువతో అటువైపు అడుగులు

బిఎ చదివిన సూర్యనారాయణ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేసేవారు. ఈ నేపథ్యంలో పలువురి ప్రోత్సాహంతో సూర్యనారాయణ చెన్నయ్ వెళ్లారు. 1977లో దాసరి నారాయణరావు నటించిన స్వర్గం నరకం చలనచిత్రంలో సూర్యనారాయణ మొట్టమొదటిసారి నటించారు. తర్వాత ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో అనేక చిత్రాల్లో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా నటించి మంచి గుర్తింపు పొందారు. హీరో శోభన్‌బాబు, అల్లు రామలింగయ్య, రావు గోపాలరావు, ఎంఎస్.నారాయణ వంటి కథానాయకులతో కలిసి నటించారు. పెళ్లంటే నూరేళ్లపంట, లారీ డ్రైవర్, విముక్తి కోసం, చినరాయుడు వంటి సుమారు 300 చిత్రాల్లో నటించారు. సినీ పరిశ్రమ చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు తరలొచ్చాక హైదరాబాదులో సూర్యనారాయణకు ఇంటి స్థలం దక్కింది. కళాకారుడుగా ప్రస్థానం ప్రారంభించిన సూర్యనారాయణ వందల సంఖ్యలో డ్రామాలు ప్రదర్శించారు.

సేవా కార్యక్రమాల్లో ముందు

మంచితనానికి మారుపేరుగా.. అభ్యుదయ భావాలు కలిగిన సూర్యనారాయణ సేవా కార్యక్రమాల్లో సైతం ముందుండేవారు. ముఖ్యంగా మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద జరిగే అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సంతాపం

సూర్యనారాయణ మృతి పట్ల ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యుదయ భావాలు కలిగిన కళాకారుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. కళలపై సూర్యనారాయణకు ఉన్న మక్కువ ఎనలేనిది అన్నారు. కళాకారులు సూర్యనారాయణను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్, జిపిఎస్ ఏ విధానమైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టమేనని, పాత పెన్షన్ విధానం తప్ప మరే విధానాన్ని అంగీకరించబోమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి స్పష్టం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని, ఒపిఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. 11వ పిఆర్‌సి ఎరియర్స్, డిఎ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు జిల్లాలో ఉన్న ఎంఎల్‌ఎలకు వినతిపత్రం అందించాలన్నారు. ఈ నెల 25న ఉమ్మడి జిల్లా భారీ సదస్సు ఏర్పాటు చేయనున్నామన్నారు. జులై 26, 28 తేదీల్లో మండల కేంద్రాల ధర్నాలు నిర్వహించనున్నామన్నారు. ఆగస్టు 4న తాలూకా కేంద్రాల్లో 12 గంటల ధర్నాలు, ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో 12 గంటలపాటు ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కె.వి.రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ వ్యవహారశైలిని తప్పుబట్టారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే జిఒ 117 రద్దు చేయాలన్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం పాఠశాలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కోశాధికారి ఎం.పట్టాభిరామయ్య, కార్యదర్శులు పి.శివప్రసాద్, రత్న, లక్ష్మీ నారాయణ, జయకుమార్, కృష్ణకుమారి, పి.క్రాంతికుమార్, రామకృష్ణంరాజు, కెఎస్.రామకృష్ణప్రసాద్, సాయిరామ్, రాష్ట్ర కౌన్సిలర్లు రామానుజరావు, రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సత్యనారాయణ, మోహన్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

మెంటేవారితోటలో భారీ అగ్నిప్రమాదం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నీచర్ షాప్ దగ్ధం - సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మెంటేవారితోటలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జయవర్ధన్ ఫర్నీచర్ షాప్, గొడౌన్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా షాప్‌లో ఉన్న ఫర్నీచర్ అంటుకోవడంతో ఉదయం ఏడు గంటల సమయంలో మంటలు ఎగసిపడ్డాయి స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గొడౌన్‌లోని ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సిహెచ్.సూర్యప్రకాశరావు వెల్లడించిన వివరాల ప్రకారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మెంటేవారితోటలోని జయవర్ధన్ ఫర్నీచర్ షాప్‌లో మంటలు చెలరేగి భారీగా మంటలు చెలరేగాయనే సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారన్నారు. ప్రమాదంలో రూ.30 లక్షల వరకూ ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశామని, పూర్తి వివరాలు విచారణలో వెల్లడవుతాయని తెలిపారు.

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

కష్టం వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి

బాధిత కుటుంబానికి ఎంఎల్ఎ గ్రంధి ఆర్థిక సాయం

కష్టాలు, నష్టాలు వచ్చినప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జయవర్ధన ఫర్నీచర్ షాప్ దగ్ధమైన సంగతి తెలిసిందే. సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులు ఉంగరాల రాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ ఇటువంటి కష్టం వచ్చినప్పుడు మనోధైర్యంతో ముందుకెళ్లాలన్నారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి పాలవెల్లి మంగ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, సమతం తాతాజీ, సుంకర చిన్న, మద్దాల రమణ, మద్దాల సత్యనారాయణ, అల్లూరి రామకృష్ణచౌదరి, ముత్యాల అంజి, కోయ మణి, శీలం రోహిత్, రామిశెట్టి జయసూర్య పాల్గొన్నారు.

‘పోలవరం పోరుకేక’ను జయప్రదం చేయాలి

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20 నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ జరుగుతున్న సిపిఎం మహాపాదయాత్ర (పోలవరం పోరుకేక)ను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా సెక్రటేరియట్ సభ్యులు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు. అనంతరం ‘పోలవరం పోరుకేక’ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడిగా పిలుస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగంచేసిన నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం తక్షణం పునరావాసం కల్పించి పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించి తక్షణం నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం ఇప్పటివరకూ చెల్లించకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విచారణ చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గోదావరి వరదల నుండి రక్షణకు ప్రభుత్వం ముందుగా సహాయక చర్యలు చేపట్టాలని, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకూ గ్రామాల నుండి ఖాళీ చేయకూడదని, పునరావాసకాలనీలు పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాలని కోరారు. ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతిఎకరాకూ రూ.20 లక్షలు చెల్లించాలన్నారు. సిఎం జగన్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షల పరిహారం ఇవ్వాలని, జిఒ 224 అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై జరుగుతున్న మహాపాదయాత్రకు నిర్వాసితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, అందుగుల ఫ్రాన్సిస్, మెడియం నాగమణి, కిషోర్, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, తెల్లం దుర్గారావు, తుమ్మల సత్యనారాయణ, జి.రాజు పాల్గొన్నారు.

ఇంద్రాణిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య విశ్రాంతి బ్యాంకు ఉద్యోగ సంఘం సభ్యులు

తెలంగాణ ఎంసెట్‌లో దుర్గా ఇంద్రాణికి 675వ ర్యాంకు

ప్రజాశక్తి - మొగల్తూరు

తెలంగాణ ఎంసెట్‌లో మొగల్తూరుకు చెందిన బొడ్డు కెకెఎల్ దుర్గా ఇంద్రాణి 675వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కాచిగూడలో ఉన్న ఆర్యవైశ్య హాస్టల్ ఆడిటోరియంలో ఆర్యవైశ్య విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆవోప బ్యాంక్ మాన్ చాప్టర్ సంఘం సభ్యులు ఆమెను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సంఘం కన్వీనర్‌లో టివిఎస్.రావు కొత్త రామానందం అధ్యక్షులు పివి రమణయ్య మాట్లాడారు. దుర్గా ఇంద్రాణి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. బొడ్డు సూర్యారావు మొగల్తూరులో ఫ్యాన్సీ వ్యాపారి. సూర్యారావు ఎల్ఐసిఆర్ కుమారి దంపతులకు ఇరువురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సర్వాణి ప్రస్తుతం బిఎల్ చదువుతోంది. చిన్న కుమార్తె దుర్గా ఇంద్రాణి తెలంగాణ ఎంసెట్లో 675 సాధించడం పట్ల గ్రామానికి చెందిన పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలపై దాడులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది ఈనెల 17న మద్యం, ఇసుక, గంజాయి, పశువుల అక్రమ రవాణా, కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌పి కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పలు కేసుల వివరాలు వెల్లడించారు. భీమవరం వన్‌టౌన్ పిఎస్ పరిధిలో పేకాటాడుతున్న 16 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.3,08,250, పేకలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రశాంతతకు భంగం కలిగించిన వారిపై 57 కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 4 కేసులు నమోదు చేశారు. ప్రజలకు దిశ యాప్ పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, యాప్‌ను 203 మందితో డౌన్లోడ్ చేయించారు. ఇప్పటివరకూ 14,37337 మందితో యాప్ డౌన్లోడ్ చేయించగా, 3,99,140 మందితో రిజిస్ట్రేషన్ చేయించారు.

విద్యకు జగన్ ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాళ్ల

సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతిస్తున్నారని సిబిసిఎన్‌సి సంఘ కార్యదర్శి ఆషేరు అన్నారు. కోలనపల్లి గ్రామంలో సిబిసిఎన్‌సి బాప్టిస్ట్ ప్రార్థనా మందిరంలో విద్యార్థి వినయ్‌కు సత్కారం సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషేరు మాట్లాడుతూ విద్యార్థి వినయ్ మొదటి నుండి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించారని, నరసాపురం సీతారాంపురం గ్రామ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించి జగనన్న ఆణిముత్యాలులకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి వినయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆహారోను, యేసు రత్నం, ప్రభాకరరావు, దానియేలు పాల్గొన్నారు.

జువ్వలపాలెం హైస్కూల్లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శీలం మణివర్ధనిని సత్కరించారు. జువ్వలపాలెం సిబిసిఎన్‌సి ప్రార్థనా మందిరంలో సంఘస్తులు మణివర్ధనిని సత్కరించారు. సిబిసిఎన్‌సి సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, సంఘస్తులందరూ ఆమెను అభినందించారు.

మాట్లాడుతున్న రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు

రైస్‌మిల్లు కార్మికులకు 365 రోజులు పని కల్పించండి

ప్రజాశక్తి - ఆకివీడు

రైస్‌మిల్లు కార్మికులకు సంవత్సరం పొడవునా 365 రోజులు పని కల్పించాలని రైస్ మిల్లులకు ప్రభుత్వం ధాన్యం సరఫరా చేయాలని సిఐటియు అనుబంధం రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం మిల్లు కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు నెల సీజన్లో రైస్ మిల్లులు 45 రోజులు తిరుగుతున్నాయని, ఆ రోజుల్లో మాత్రమే కార్మికులకు పని దొరుకుతోందని తెలిపారు. మిగిలిన కాలం వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. కొన్నిసార్లు ఆ పనులు లేకపోతే చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు పూర్తిస్థాయిలో ధాన్యం ఇస్తే కార్మికులకు ఈ సమస్యలు ఉత్పన్నమవ్వవన్నారు. కనీస వేతన చట్టం కింద కార్మికులకు నెలకు కనీసం 26 వేల రూపాయల జీతం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిత్యావసరాలు తగ్గించి ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు. తెలంగాణ తరహాలో ఇక్కడ కూడా పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వి గోపాలన్, మండల అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు, యూనియన్ నాయకులు గండేటి ఈశ్వరరావు, ఎన్ని రత్నయ్య, బుర్ర శీను, ఎస్.నాగయ్య, కొట్టు సత్యనారాయణ, బి.సత్యం, రమణ, పి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

రహదారిపై నిలిచిన మురుగునీరు

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

రోడ్లపైనే మురుగునీరు, స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతంలోని మర్రివాని వీధిలో రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం, రోడ్డు పల్లంగా ఉండడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. దీనివల్ల దోమలు విజృంభించడంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని, మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తొక్కొడు డ్రెయిన్ ఆక్రమణ..!

ప్రజాశక్తి - వీరవాసరం

నందమూరుగరువులో తొక్కొడు డ్రెయిన్‌ను ఆక్రమించుకుని చెరువు తవ్వుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. సుమారు 70 లింకుల వెడల్పు ఉన్న తొక్కొడు గట్టును ఆక్రమించుకొని ఇప్పటికే కొంత మంది రైతులు చెరువులు తవ్వుకున్నారని, దీంతో ఎగువ ప్రాంత ఆయకట్టుకు వెళ్లేందుకు సక్రమమైన దారి లేకుండా పోతోందని స్థానిక రైతు కొప్పినీడి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించాలని సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సర్వే అధికారులు, ఆక్రమణదారుల ఒత్తిడికి తలొగ్గి సర్వేను మధ్యలోనే నిలుపుదల చేసి వెళ్లిపోయారని చెబుతున్నారు. దీంతో ఆక్రమణదారులు మరోసారి వారి చెరువుల తవ్వి తొక్కొడు గట్టుపై మట్టి వేసి రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. తొక్కొడు డ్రెయిన్ గట్టు వెంబడి సుమారు 70 ఎకరాల ఆయకట్టు రైతులు రాకపోకలు సాగిస్తూ ఉంటారని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న తొక్కొడు డ్రెయిన్ సర్వే చేసి వాస్తవ హద్దులను గుర్తించాలని కోరుతున్నారు. అయితే ఆక్రమణదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రైతుల వాదన మరోలా ఉంది. గతంలో కూడా సర్వే చేశారని, తొక్కొడు డ్రెయిన్ వెడల్పు సుమారు 30 లింకులు మాత్రమేనని డ్రెయిన్ గట్టును ఆక్రమించుకోలేదని పాత గట్టుపై మరోసారి మట్టి వేసి గట్టును పటిష్టం చేసుకుంటున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తిస్తే తమకు ఎటువంటి అభ్యంతరాలూ లేవని ఆరోపణలు ఎదుర్కొంటున్న రైతులు తెలిపారు.

నందమూరుగరువులో తొక్కొడు గట్టును ఆక్రమించుకుని తవ్వుతున్న చెరువు

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

102 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కడకట్ల జనతా ఛారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 102 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం 9 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసేందుకు నిడదవోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సన్నిధి సూర్య నారాయణ మూర్తి తెలిపారు. అవసరమైన 22 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్ పదం కుమార్ గుప్త మాట్లాడుతూ తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలు పట్టణానికి స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని, వాటన్నింటికీ కూడా తమ వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. ఈ శిబిరంలో ప్రెసిడెంట్ సన్నిధి సూర్యనారాయణమూర్తి, సెక్రటరీ వంగపండు రామమోహనరావు, ట్రెజరర్ చిన్నం జగదీష్ పాల్గొన్నారు.

డైమండ్స్ లయన్స్‌కు అవార్డుల పంట

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యువతను లయ నిజంలోకి ఆహ్వానించడం మన బాధ్యత అని లయన్ చిగురు పాటి వరప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా అవార్డ్స్ ఫంక్షన్ ఆదివారం నిడదవోలు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. జిల్లాలో రిజియన్ 4 జోన్ 3 సంబంధించి తాడేపల్లిగూడెం డైమండ్స్‌కు టాప్‌స్టార్ క్లబ్ అవార్డును క్లబ్ అధ్యక్షులు డాక్టర్ పంకజాక్షన్ అందజేశారు. అలాగే బెస్ట్ యూత్ ఎవేర్నెస్ క్లబ్ అవార్డు డైమండ్స్ లయన్స్ క్లబ్‌కు, వ్యక్తిగత ప్రత్యేక ప్రశంసా అవార్డును లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు, పూర్వపు గవర్నర్స్ శ్రీరామ్ సురేష్, దామర రంగారావు, కెవి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

అవార్డు అందజేస్తున్న పంకజాక్షన్

మంత్రి కొట్టును కలిసిన ఫాదర్ ఫినిహాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక జూబ్లీ రోడ్డులోని క్రైస్ట్ లూథరన్ చర్చి నూతన పాస్టర్‌గా వచ్చిన రెవరెండ్ డిఎల్.ఫినిహాస్ ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ప్రార్థన చేసి ఆశీర్వచనాలు పలికారు. ఆయన వెంట చర్చి ఛైర్మన్ కె.విజయ ప్రసాద్, నక్కా మార్టిన్, విద్యాసాగర్, అడిషనల్ పాస్టర్ రత్నాకర్ పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేయొద్దు : డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని దత్తత తండ్రి, దత్త పుత్రుడు' పచ్చ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తనకు ప్రాణ హాని ఉందని తాజాగా పవన్ ప్రచారం చేస్తున్నారన్నారని, చంద్రబాబు వల్లే ప్రాణహాని తప్ప మరెవ్వరి వల్ల ఉండదని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. జగన్‌కు భగవంతునిపై అత్యంత విశ్వాసం ఉందన్నారు. ఆలయాలు పునర్నిర్మాణం చేసి ఆయన భక్తిని చాటుకున్నారన్నారు. చంద్రబాబు మాదిరిగా కాదన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విజయవాడలో యాగం నిర్వహించినట్లు తెలిపారు. ఎనిమిది ఆగమాలను కలిపి యాగం చేయడం చరిత్రలో లేదని స్పష్టం చేసారు. ఈ విషయాన్ని పీఠాధిపతులు సైతం పేర్కొనడం జరిగిందన్నారు. అటువంటి వ్యక్తిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. రూ.280 కోట్లతో ఆలయాలను తీర్చిదిద్దుతున్నారన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి ప్రాంతాల్లో ఆలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా పవన్ విజ్ఞతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ముప్పిడి సంపత్ కుమార్, కె.ధర్మరాజు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మహిళలకు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శివదేవుని చిక్కాల గ్రామంలో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కుట్టు మిషన్ శిక్షణ, ఉచితంగా కుట్టు మిషను పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయంకృషితో మహిళా అభివృద్ధి సాధించాలని, అందుకు తగిన విధంగా శిక్షణ తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నిమ్మల వెంకట రామారావు మాట్లాడుతూ 2015లో దీన్ని ప్రారంభించామని, గ్రామంలోని ప్రజలే కాకుండా చుట్టుపక్కల అన్ని గ్రామాల్లో గల మహిళలు అభివృద్ధి పథంలో పయనించాలని కోరుకుంటున్నామన్నారు. కుట్టు మిషన్ శిక్షణ కోసం 341 మందిని ఎంపిక చేశామని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో హెల్త్, ఎడ్యుకేషన్, కంప్యూటర్ శిక్షణ అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు హాజరయ్యారు. మరో ముఖ్యఅతిథిగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి భర్త, శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ నిమ్మల అనంత రామారావు, కుమార్తె భవాని, ఐఆర్ఎస్ సిఇఒ కోట్ల శివశంకర్, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, నారాయణరావు, మాజీ సర్పంచి వడ్డే సోమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నిందితులను శిక్షించాలని టిడిపి ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అధికార పక్షం వైసిపి హత్యలను ఖండిస్తూ టిడిపి భీమవరం నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణం ప్రకాశం చౌక్ సెంటర్లో పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ధర్నా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలానికి చెందిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను వైసిపి కార్యకర్త వెంకటేశ్వరరెడ్డి, అతని అనుచరులు గంజాయి మత్తులో అమానుషంగా హత్య చేయడాన్ని ఖండించారు. ఈ మేరకు నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భీమవరం నియోజవర్గ టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం భీమవరం ప్రకాశంచౌక్‌లో నిరసన తెలియజేస్తున్నామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బలహీన వర్గాలపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిపోయి ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా ఉందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్ బాబు, చెల్లబొయిన సుబ్బారావు, కృష్ణ బలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు మాట్లాడారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదాసు కనకదుర్గ, ఎండి షబీనా సయ్యద్, నసీమాబేగం, చల్లబోయిన గోవింద్, గునుపూడి తిరుపాల్, మద్దుల రాము, కటికల పల్లారావు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

పాలకొల్లులో ట్రాఫిక్ సమస్య

కార్యరూపం దాల్చని బైపాస్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు - భీమవరం రహదారి గుండా ట్రాఫిక్ నానాటికీ గడ్డుగా మారుతోంది. కేశే కృష్ణంరాజు కేంద్ర మంత్రిగా ఉండగా 2000లో ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా బైపాస్ రోడ్డు నిర్మించాలని పలుమార్లు చెప్పారు. అయితే ఆయన ప్రతిపాదించి 22 సంవత్సరాలైనా నేటికీ కార్యరూపం దాల్చలేదు. రెండు ప్రధాన పట్టణాల మధ్య 22 కిలో మీటర్ల దూరానికి ట్రాఫిక్ నేపథ్యంలో ముప్పావు గంట నుంచి గంటకుపైగా సమయం పడుతోంది.

భీమవరం జిల్లా కేంద్రం.. మరింత పెరిగిన ట్రాఫిక్ ..

భీమవరం జిల్లా కేంద్రం కావడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. భీమవరం నుంచి విస్సాకోడేరు వరకూ రోడ్డు విస్తరణ చేస్తున్నారు. అయినా ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం లేదు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల నుంచి సగంచెరువు వరకూ దగ్గులూరు ప్రతిపాదిత మెడికల్ కాలేజీ మీదుగా జాతీయ రహదారిని బైపాస్ రోడ్డుగా మార్చాలని టిడిపి హయాంలో ప్రతిపాదించారు. అయితే జగన్ మెడికల్ కాలేజీకి భూమి పూజ చేసి రెండు సంవత్సరాలయ్యాక ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో భీమవరం, పాలకొల్లు రహదారి మెరుగైన పరిస్థితి కనిపించడం లేదు. ఈ రోడ్డులో శృంగవృక్షం వద్ద రైల్వే గేటు వేస్తే ట్రాఫిక్ క్లియర్‌కు పావుగంట సమయం పడుతుంది. ఈ రహదారిని విస్తరించకుండా దీనికి సమాంతరంగా ఉన్న మార్టేరు-అత్తిలి రోడ్డును ఇటీవల జగన్ ప్రభుత్వం విస్తరించింది. అంటే ట్రాఫిక్ అవసరాల కంటే కొందరి అవసరాల కోసం రోడ్లు విస్తరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా వీరవాసరం వద్ద గతంలో రోడ్డు విస్తరణకు గ్రామస్తులు సహకరించకపోవడంతో ప్రస్తుతం అక్కడ రోడ్డు అధ్వాన్నంగా మారింది. దీంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం.

ఏలూరు ప్రయాణం నరకం..

పాలకొల్లు నుంచి ఏలూరు రోడ్డు దుస్థితి దారుణంగా ఉంటుంది. దీనికితోడు ట్రాఫిక్ నేపథ్యంలో ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు మూడు నుంచి ఐదు గంటల సమయం పడుతుంది. దేశం, రాష్ట్రం ఆర్థికంగా, సాంకేతికంగా ముందంజలో ఉన్నా సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయాణ సమయంలో మాత్రం మార్పు లేదు. కేవలం ఇన్నోవా వంటి ఆధునిక కార్లు ఉన్న వారికి తణుకు మీదుగా జాతీయ రహదారిపై వెళ్లేవారి పరిస్థితి మెరుగైంది. కాని సామాన్య ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. ప్రస్తుతం నరసాపురం, పాలకొల్లు వాసులు భీమవరం వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ లేక బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితేనే ఫలితం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

పాలకొల్లులో నిలిచిన ట్రాఫిక్

3న బాల సంస్కార్ సెంటర్లు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జులై 3 నుంచి బాల సంస్కార్ సెంటర్లు ప్రారభించనున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి సిహెచ్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మార్టేరు గౌరీశంకర దేవాంగ కళ్యాణ మండపం వద్ద బాల సంస్కార్ సెంటర్ టీచర్స్ కోసం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు, తణుకు, అత్తిలి, గణపవరం మండలాల నుండి 28 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఆయా మండలాల్లో సెంటర్లు కొనసాగించేందుకు 20 మందిని ఎంపిక చేశామన్నారు. రాబోయే గురుపౌర్ణమి రోజున బాల సంస్కార్ సెంటర్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి సూర్యతేజ, సాధానాల శ్రీనివాస్, డి.మోహనకృష్ణ, ఎస్.ఉర్ధన్య, జె.దుర్గాప్రసాద్, డి.గంగారత్నం, శ్రీరామకృష్ణశర్మ జడ్జిలుగా వ్యవహరించారు .

అచ్యుతు రామారెడ్డికి అభినందనలు తెలిపిన టిడిపి నాయకులు

అచ్యుత రామారెడ్డికి అవార్డు రావడంపై హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా కర్రి అచ్యుత రామారెడ్డి కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమని పలువురు టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం అవార్డు అందుకున్న సందర్భంలో మార్టేరు పిహెచ్‌సి మాజీ ఛైర్మన్, విజయ కేటరీ కర్రి అచ్యుత రామారెడ్డిని కలెక్టర్ పి ప్రశాంతి అభినందించిన సందర్భంగా మాజీ ఎంపిపి కట్ట బాలాజీ వన్ కుమార్, ఒఎన్‌జిసి కడలి వెంకటేశ్వరరావు, టీచర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు పాల ప్రసాద్, మానవతా మాజీ అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గూడెంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను బాబా రామ్ దేవ్ ఆదేశానుసారం పతాంజలి యోగా సమితి తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 100 బైక్‌లతో ర్యాలీ ఘనంగా నిర్వహించారు. పట్టణ సిఐ నాగరాజు, రూరల్ సిఐ మూర్తి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు, ఆరా ఫౌండేషన్ అధ్యక్షులు కరిబండి రామకృష్ణ, ఇంజమూరి మాధవరావు, బడుగు చంద్రశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

అమర్‌నాథ్ హత్యకు కారకులను ఉరితీయాలి

రవి బాబు డిమాండ్

ప్రజాశక్తి - ఉండి

చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి అమర్నాథ్‌ను అత్యంత పైశాచికంగా హతమార్చిన దుండగులను ఉరితీయాలని తెలుగు యువత నరసాపురం పార్లమెంటు కార్య నిర్వాహక కార్యదర్శి బురిడీ రవి బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిసిలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగిపోయాయని చెప్పారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి మొక్కవోని ధైర్యంతో కుటుంబానికి అండగా నిలుస్తూ విద్యనభ్యసిస్తున్న అమర్నాథ్‌ను హతమార్చడం దారుణం అన్నారు. తన అక్కను వేధించొద్దని వారించిన అమర్నాథ్‌ను పైశాచికంగా కాళ్లూ, చేతులు కట్టేసి సజీవ దహనం చేయటం రాక్షసకాండగా అభివర్ణించారు. ఘటనకు పాల్పడిన దుండగులను ఉరితీయాలని, లేదా ఎనౌకౌంటర్ చేయాలని రవి బాబు డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అమర్నాథ్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకూ టిడిపికి అండగా నిలుస్తామని రవిబాబు పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, BOMMILI VIJAY KUMAR (Old Name), S/o. Srinivas Raju, Resident of D.No. 2-37, Jangala peta, Near Ganganamma Temple, Pinkadimi Village, Eluru District Change My Name From **BOMMILI VIJAY KUMAR (Old Name) to BOMMILI VIJAYA KUMAR (New Name).** Hence forth Iam being Called as **BOMMILI VIJAYA KUMAR (New Name), S/o. Srinivas Raju** for all Purpose.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజా పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814